క్లుప్తంగా

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



మద్దూరు: మండలానికి చెందిన క్రీడాకారులకు ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ గోపాల్‌నాయక్, ఎంపీఓ ఉదయ్‌శంకర్ తదితరులు శుక్రవారం మద్దూరు బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. వజ్రోత్సవాల ఫ్రీడం కప్ జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో మండల క్రీడాకారులు వాలీబాల్, ఖోఖోలో మొదటి స్థానం సాధించిన సందర్భంగా వారిని అభినందిస్తూ ఎంపీపీ, ఎంపీడీఓ, మద్దూరు సర్పంచ్ అరుణ, మరో ముగ్గురు అధికారుల కలిసి వీరికి దుస్తులను అందించారు. ఈ సందర్భంగా క్రీడల్లో మంచిగా రాణించి మండలానికి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన పీఈటీ అనంతసేనను అభినందించారు. కార్యక్రమంలో బాలుర పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు, ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగరాలి



నర్వ: గ్రామ గ్రామాన బీజేపీ జెండా ఎగరాలని బీజేపీ మండల అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయికోడ్, కల్వాల్, కుమార్‌లింగంపల్లి గ్రామాల్లో బూత్ కమిటీలను నియమించారు. కల్వాల్‌లో బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారని, హామీల అమలులో విఫలమైన బీఆర్‌ఎస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. గ్రామాల్లో బీజేపీ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కల్వాల్ ఆంజనేయులు, కుర్వ సత్యం, వడ్డె ఆంజనేయులు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వావిళ్ల రవికుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'బహిరంగ క్షమాపణ చెప్పాలి'



ధన్వాడ: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 60 ఎమ్మెల్యే స్థానాలను కేటాయించాలని కోరారు. సమావేశంలో రవియాదవ్, గుర్రంరాజు, బాలరాజు, అరవింద్, మహిమూద్, తిరుమలేష్, బాను తదితరులు ఉన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు



మద్దూరు: మండలంలోని ఏ పంచాయతీలోనైనా పంచాయతీ రోడ్లను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని ఎంపీఓ ఉదయశంకర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో పాతబస్టాండ్ వద్ద గతంలో ఉన్న వీధి రోడ్డును ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడితే మద్దూరు గ్రామపంచాయతీ సిబ్బందిచే వాటిని తొలగించారు. ఈ రోడ్డు ఆక్రమణకు గురికావడంతో అడిషన్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణను తొలగించామని ఎంపీఓ తెలిపారు. కార్యక్రమంలో మద్దూరు పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలకు నీరందించాలి



నారాయణపేట టౌన్: పట్టణంలోని యాద్గీర్ రోడ్డు నుంచి ఎర్రగట్టు రోడ్డు వరకు నాటిన ప్రతి మొక్కకు ట్యాంకర్ల ద్వారా నీరందించాలని మున్సిపల్ కమిషనర్ సునీత అన్నారు. శనివారం ప్రతి ఒక్కరూ కూడా ఇంటి పక్కన నాటిన మొక్కలను తమ బాధ్యతగా తీసుకొని నీరు పోసి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న పూజారులు

నారాయణపేట రూరల్: మండలంలోని పేరపళ్లలో గజలమ్మ తల్లి దేవతా విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని మేళ తాళాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి గ్రామ దేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదేవి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జగన్నాథ్, అయ్యప్ప దీక్ష సమితి కన్వీనర్ కాకర్ల భీమయ్య పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో మూడు రోజులుగా బొడ్రాయి పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ధ్వజస్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు నూతన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం కనులపండువగా చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయంలో గ్రామస్తులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ప్రజలు సుఖ సంతోషాలతో పాటు పాడి పంటలు నిండుగా పండాలనే ఉద్దేశంతో బొడ్రాయిని ప్రతిష్ఠించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తిమ్మప్ప, ఉపసర్పంచ్ అంజమ్మ, ఎంపీటీసీ బంగి లక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



మాగనూర్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

మాగనూర్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న నాయకులను మాగనూర్ ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దండు ఆనంద్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న తమను పోలీసుల అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నా కేసీఆర్ నిరుద్యోగులను నిలువునా ముంచాడని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి ఇస్తామని మాట తప్పారన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగ భృతి కల్పించి నిరుద్యోగులను ఆదుకుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేణుగౌడ్, లంగటి మారెప్ప, నర్సింహ, ముష్టి రాజు తదితరులు ఉన్నారు.

మరికల్: విద్యారంగ సమస్యలపై శుక్రవారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో హరీష్, ఆంజనేయులు, చెన్నయ్య, రఘు, శేఖర్, ఖాజాలు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు

ధన్వాడ: మండల కేంద్రానికి నూతన బస్టాండ్ మంజూరు అయినట్లు శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బంది శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ నిర్మాణం కోసం మొత్తం రూ.30 లక్షలు విడుదల అయ్యాయని అధికారులు పేర్కొన్నారు. స్థల సేకరణ పూర్తైన తర్వాత పనులు ప్రారంభిస్తామని వివరించారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

మరికల్: మండలంలోని ఎలిగండ్లలో జెడ్పీ నిధులతో నాణ్యతతో పాఠశాల భవనం నిర్మాణ పనులు చేస్తున్నామని సర్పంచ్ దేవమ్మ, నాయకులు ప్రకాశ్ శెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పనులు నాసిరకంగా చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించడం సరికాదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని వివరించారు. విమర్శలు మాని కలిసికట్టుగా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

దర్శకుడు విశ్వనాథ్‌కు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న ఎస్పీ బాలు అభిమానులు

నారాయణపేట రూరల్: కళా తపస్వీ, చలనచిత్ర దర్శకుడు కే.విశ్వనాథ్‌కు శుక్రవారం కళాకారులు ఘనంగా నివాళి అర్పించారు. స్థానిక బాలకేంద్రంలో ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, సంగనర్సింహులు, జ్ఞానామృత, వసంత్, సువర్ణ పాల్గొన్నారు.

పింఛన్లు ఆలస్యంతో లబ్ధిదారుల అవస్థలు

నారాయణపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్లు డిసెంబర్ నెలకు సంబంధించిన డబ్బులను ఇప్పటివరకు బ్యాంక్ ఖాతాలో జమ చేయలేదు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 10తేదీ లోపు డబ్బులు జమ చేస్తారని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. జనవరి నెలలో ఇవ్వాల్సిన పింఛన్లు ఫిబ్రవరి ప్రారంభమైన అందకపోవడంతో చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థి ఎంపిక



శ్యాంకుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దామరగిద్ద: జాతీయ స్థాయి అండర్ 16 అథ్లెటిక్స్ పోటీలకు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి శ్యాంకుమార్ ఎంపికయ్యాడు. శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం జ్యోతి సమక్షంలో ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, పీఈటీ రమేష్‌లు మాట్లాడుతూ ఈ నెల 10, 12 తేదీల్లో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి 1600 మీటర్ల పరుగు పందెం పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల శంభులింగం, తిరుపతయ్య, మల్లికార్జున్ తిప్పణ్ణ, లక్ష్మణ్, బాల్‌రాజ్, మహిపాల్ రెడ్డిలు పాల్గొన్నారు.

బస్సును ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

మరికల్: బస్సును ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు వివరాల ప్రకారం అమరచింత మండలం చిన్న కడ్మూర్‌కు చెందిన కుర్వ మల్లేష్ హైదరాబాద్‌లో పళ్ల వ్యాపారం చేస్తున్నాడు. శుభకార్య నిమిత్తం తమ బంధువుల ఇంటికి మక్తల్‌కు వచ్చాడు. బైక్‌పై తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు వెళ్తుండగా మరికల్ మండలం తీలేర్ స్టేజీ వద్దకు రాగానే వెనుక నుంచి బస్సును ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్ పై ఉన్న మల్లేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాధితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాలుగు ఇసుక టిప్పర్ల పట్టివేత



పట్టుబడ్డ టిప్పర్లు

నారాయణపేట రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు టిప్పర్లను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం అనుమతి లేకుండా హన్మంతు (వల్లంపల్లి), ఆనంద్ (శ్యాసన్‌పల్లి), లాలప్ప (బైరంకొండ), మొగలప్ప (నారాయణపేట)లకు చెందిన వారు ఇసుకను తరలిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు దాడులు నిర్వహించి కొండారెడ్డిపల్లి శివారులో టిప్పర్లను పట్టుకున్నారు. సరైనా అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు తప్పగించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

జీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ



నారాయణపేట రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం (జీటీఏ) ఆధ్వర్యంలో రూపొందించిన నారాయణపేట జిల్లా నూతన క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక జ్యోతిరావు పూలే పాఠశాలలో జేడీ వెంకటనర్సమ్మ, డీఈఓ లియాకత్ అలీలు ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, ఎస్‌ఓ శ్రీనివాస్, సంఘ బాధ్యులు భీమన్న, సంజీవ్‌రెడ్డి, జయంత్, నిరంజన్, ముంతాజ్ అహ్మద్, అక్తర్, మసూమ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కలిపిస్తున్న హెడ్ కానిస్టేబుల్

ఊట్కూరు: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ తిమ్మారెడ్డి కోరారు. శుక్రవారం చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ అతిగా వినియోగించడం, అమ్మాయిలు, మహిళలపై వేధింపులు తదితర అంశాలపై ఆట పాటల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం యువకులు, తోటి విద్యార్థులు పాటుపడాలని కోరారు. విద్యార్థులు చిన్నచిన్న కారణాలతో బడి మానేసి పనులకు వెళ్తుంటే ఆ సమాచారాన్ని ప్రధానోపాధ్యాయులకు, పోలీసులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, సర్పంచ్ రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న నరేష్‌గౌడ్

ఊట్కూరు: దివ్యాంగుల అభ్యున్నతి, సంక్షేమం కోసం రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని దివ్యాంగుల రాజ్యాధికార ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బిజ్వార్ నరేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగాలు, ఉపాధి లేక వేలాది మంది దివ్యాంగులు సతమతం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి దివ్యాంగుల శాఖను వేరు చేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. దివ్యాంగులకు కూడా దివ్యాంగ బంధు ఇవ్వాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఉద్యోగాలు కలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తిరుపతయ్య, హుస్సేన్, ఆంజనేయులు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అజ్మీర్ చాదర్ ఊరేగింపు

అమరచింత: ప్రముఖ అజ్మీర్ దర్గా షరీఫ్ ఉర్సు సందర్భంగా పట్టణంలోని జామీయా మసీద్ కమిటీ, ఇమానీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చాదర్ ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. పవిత్ర నమాజు అనంతరం రాజవళీ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అజ్మీర్ దర్గా షరీఫ్‌కు తరలించే చాదర్‌ను పట్టణ పురవీధుల గుండా ప్రదర్శనగా మహబూబ్ ఉస్సేనీ దర్గా వద్దకు తీసుకొచ్చారు. దర్గాలో ప్రత్యేక పాతేహలు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా మాట్లాడుతూ పట్టణం నుంచి ప్రతి ఏడాది అజ్మీర్ దర్గా షరీఫ్‌కు చాదర్ పంపడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జామీయా మసీదు కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, కౌన్సిలర్ లక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహులు, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, అక్కల నరసింహులు గౌడ్, ఖదీర్, మైనోద్దీన్, అన్సారీ పాల్గొన్నారు.



అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి



చెక్కు అందజేస్తున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందు నామాజీ

నారాయణపేట టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందు నామాజీ అన్నారు. శుక్రవారం దామరగిద్ద మండలం కందెన్‌పల్లి చెందిన బాలప్పకు రూ.24 వేలు, లోకుర్తికి చెందిన లక్ష్మికి రూ.21 వేల సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అందించే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎం సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందించేందుకు సహకరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి అప్పిరెడ్డిపల్లి రాము, దామరగిద్ద మండల బీజేపీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీటీసీ అంజిలప్ప, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు స్థాయి మరిచి కొందరు విమర్శలు చేయడం తగదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కొడంగల్‌లో జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొందరు గ్రామ స్థాయి నాయకులు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మెప్పు కోసం స్థాయి మరిచి ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి తన పర్యటనలో నేటికీ పూర్తి కాని ప్రభుత్వాస్పత్రి నిర్మాణం, డిగ్రీ కళాశాల, ఇతర అభివృద్ధి పనులపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా తప్పుడు మాటలతో ఎదురుదాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఆనాడు ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గురునాథ్‌రెడ్డి అండతోనే నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారని, గురునాథ్‌రెడ్డికి పదవులిస్తామని ఆశ పెట్టి మోసం చేసిన విషయం నిజం కాదా అన్నారు. రూ.కోట్ల నిధులు తెచ్చామనే నాయకులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ వార్ల విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, ఇద్రీస్, నాయకులు నాగులపల్లి నరేందర్, రమేష్‌రెడ్డి, ఆసీఫ్, సలీం, టింట్ నర్సింహ, వెంకట్, ఫిరోజ్, మహిపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



మద్దూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల హెచ్‌ఎంగా భానుప్రియ, ఎంఈఓగా ప్రవళిక, డీఓగా శివచరణ్, కలెక్టర్‌గా వెన్నెల వ్యవహరించగా మరో 20 మంది విద్యార్థులకు ఉపాధ్యాయులుగా వ్యవహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయులు సుభాష్, భాస్కర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



ప్రారంభమైన ఆలయ నిర్మాణ పనులు

నారాయణపేట రూరల్: పట్టణ శివారులోని శబరి పీఠం సన్నిధానంలో నిర్మిస్తున్న వినాయక దేవాలయ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ స్థలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని, స్వామివారి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ధన, వస్తు రూపంలో సహకారం అందించాలని కోరారు.

వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ధన్వాడ: వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా నాయకుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం పథకం వంట కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం కార్మికులతో కలిసి కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ నెల 8న ఇందిరాపార్కు చౌక్ వద్ద ధర్నా నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు వైద్య పరీక్షలు

నారాయణపేట రూరల్: వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. మండలంలోని కృష్ణగోకులం పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పోలీసు, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో చేరాలనుకునే అభ్యర్థులు 200 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. చెవి, ముక్కు, ఇతర శస్త్ర చికిత్సలకు సంబంధించిన వైద్య బృందం హాజరై పరీక్షలు చేశారు. అనంతరం భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేష్, జ్యోతి, కేశవులు, హరీశ్వర్, ఆంజనేయులు పాల్గొన్నారు.